# కష్టానికి దక్కిన ఫలితం

- బీఆర్ఎస్ ప్రభుత్వంలో వరుస నోటిఫికేషన్లు
- పైరవీలకు ఆస్కారం లేకుండా కొలువుల భర్తీ
- ఉద్యోగాలు సాధించిన నిరుపేద, సాధారణ కుటుంబాల బిడ్డలు
- పకడ్బందీగా నియామకాలు చేపట్టిన ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న ఉద్యోగార్థుల కుటుంబ సభ్యులు

ఉద్యోగాల నోటిఫికేషన్లు సకాలంలో రాక.. వచ్చినా వాటిని పూర్తిస్థాయిలో భర్తీ చేయకపోవడంతో ఉమ్మడి రాష్ట్రంలో నిరుద్యోగులు నరకయాతన పడ్డారు. ఉన్న కొద్దిపాటి ఉద్యోగాల నియామకాల్లో అవినీతి, డబ్బు, పైరవీలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో అవన్నీ సంపన్నుల కుటుంబాల పిల్లల వశమయ్యాయనే ఆరోపణలుండేవి. దీంతో ఏళ్లకొద్దీ చదివిన నిరుద్యోగ అభ్యర్థులకు నిరాశే ఎదురయ్యేది. స్వరాష్ట్రంలో కష్టపడి చదివిన అభ్యర్థులకే ఉద్యోగాలు దక్కాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ ఉద్యోగాల నియామకాన్ని పకడ్బందీగా చేపట్టారు. ఖాళీగా ఉన్న శాఖల్లో పోస్టులను భర్తీ చేయడంతోపాటు పారదర్శకంగా నియామకాలు చేపట్టారు. పుస్తకాలతో కుస్తీపట్టిన పేటింటి, సాధారణ కుటుంబాల పిల్లలే ఎక్కువగా ఉద్యోగాలు సాధించారు. తమ కుటుంబాలకు ఆసరాగా నిలిచారు. తెలంగాణ ప్రభుత్వ హయాంలోనే తమ పిల్లలకు ఉద్యోగాలు వచ్చాయని వారి తల్లిదండ్రులు ఆనందపడుతున్నారు.

*– ఖమ్మం, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

## పైరవీలు, పైసలు లేకుండా మా కొడుకుకు ఉద్యోగం..





మాది అశ్వారావుపేట మండలం నల్లబాడు గ్రామం. మధ్య తరగతి వాళ్లం. కానిస్టేబుల్ ఉద్యోగ నియామకాల కోసం తెలంగాణ ప్రభుత్వం నోటిఫికేషన్ వెంటనే మా చిన్న కుమారుడు బండ్రెడ్డి వీర వెంకట సత్యనారాయణ దరఖాస్తు చేశాడు. మొదటి ప్రయత్నంలోనే కానిస్టేబుల్ కొలువు సాధించాడు. మా మిగతా ఇద్దరు కుమారులు ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. మేము పాల వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నాం. మాకు ఉన్న ఒక్క ఎకరంలో అంతర పంటలు సాగుచేస్తూ పిల్లలను చదివించుకున్నాం. మా చిన్న కుమారుడు వీర వెంకట సత్యనారాయణ కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నాడు. సొంతంగానే కష్టపడి ఉద్యోగం సాధించాడు. తెలంగాణ సర్కారు వచ్చాకే నా కొడుకు ఉద్యోగం సాధించాడు. పైరవీలు, పైసల ఖర్చు ఏమీ లేవు. మా కుమారుడికి తెలంగాణ సర్కారులో ప్రభుత్వ ఉద్యోగం రావడంతో మా కుటుంబానికి భరోసా కలిగింది.

**–బండ్రెడ్డి వీరాంజనేయులు, కనకదుర్గ, నూతన కానిస్టేబుల్ తల్లిదండ్రులు**

## తెలంగాణ సిద్ధించింది.. ఉద్యోగం లభించింది..





భద్రాద్రి జిల్లా అశ్వాపురం మండలం మల్లెలమడుగు గ్రామం మాది. స్వరాష్ట్రంలో మా ఆశయాలు నెరవేరాయి. నీళ్లు, నిధులు, నియామకాలు అనే ఆకాంక్షకు అర్థం చేకూరింది. తెలంగాణ వస్తే మా కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం వస్తుందని ఎన్నో కలలుగన్నాం. ముఖ్యమంత్రి కేసీఆర్‌తో మా కలలన్నీ నెరవేరాయి. గ్రామంలో ఇంటి వద్ద చిన్న కిరాణా దుకాణం, అందులోనే ఉదయం పూట అల్పాహారం విక్రయిస్తూ బతుకు వెళ్లదీస్తున్నాం. మా కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగ వస్తే ఆర్థికంగా మాకు కొండంత ధైర్యం ఉంటుందని అనుకున్నాం. తెలంగాణ వస్తే తప్పకుండా మా కొడుకు ఉద్యోగం సాధిస్తాడని నమ్మకంతో ఉన్నాం. మా నమ్మకం నిజమైంది. తెలంగాణ ప్రభుత్వం పోలీసు శాఖలో అధిక ఉద్యోగాలు భర్తీ చేసింది. ఇదే శాఖలో మా కుమారుడు కూడా నవీన్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించాడు. మేం పేదరికంలో ఉన్నప్పటికీ మా కొడుకు చదువుకు ఆటంకం కలుగనీయలేదు. వాడు కూడా మా ఆర్థిక పరిస్థితిని గమనించి పట్టుదలతో చదివాడు. జిల్లా కేంద్రమైన కొత్తగూడెం లైబ్రరీలో ప్రతి రోజూ చదువుకునే వాడు. అక్కడే రూము అద్దెకు తీసుకుని కష్టపడి చదివాడు. రెండో ప్రయత్నంలో రాత పరీక్షలో 110 మార్కులు, ఈవెంట్లలో 70 మార్కులు సాధించి కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు.

**–బొడ్డుపల్లి వెంకన్న, రమణ, కానిస్టేబుల్‌గా ఎంపికైన నవీన్ తల్లిదండ్రులు, అశ్వాపురం**

## 2017 నోటిఫికేషన్‌లో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యా..





తెలంగాణ ప్రభుత్వం నాకు మంచి భవిష్యత్తునందించింది. మాది అశ్వారావుపేట పట్టణం. మా అమ్మానాన్న బద్దిరెడ్డి రెడ్డిబాబు, నాగలక్ష్మి. వాళ్లు ఇక్కడ చిన్న హోటల్ నడుపుతూ నన్ను, నా సోదరుడు రాజేశ్‌ను పోషిస్తున్నారు. ఆర్థిక ఒడిదొడుకుల కారణంగా మధ్యలో నేను చదువు ఆపేశాను. హోటల్లో మా తల్లిదండ్రులకు సాయంగా ఉన్నాను. కానీ ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న పట్టుదలతో మళ్లీ చదువును కొనసాగించాను. ఇదే సమయంలో బెటాలియన్ కానిస్టేబుల్ నియామకాల కోసం తెలంగాణ ప్రభుత్వం 2017లో నోటిఫికేషన్ విడుదల చేసింది. వెంటనే దరఖాస్తు చేసి ఉద్యోగానికి సన్నద్ధమయ్యాను. శిక్షణ కూడా పొందాను. 2018లో జరిగిన రాత పరీక్షకు హాజరయ్యాను. 200 మార్కులకుగాను 121 మార్కులు సాధించాను. దీంతో బెటాలియన్ విభాగంలో కానిస్టేబుల్‌గా ఉద్యోగం లభించింది.

మొదట సత్తుపల్లి బెటాలియన్‌లో పనిచేసిన నేను.. ప్రస్తుతం కొత్తగూడెం బెటాలియన్‌లో పనిచేస్తున్నాను. మరింత పట్టుదలతో ఇటీవల అగ్నిమాపక సిబ్బంది నియామకాలకు కూడా దరఖాస్తు చేశాను. పరీక్షలో అర్హత కూడా సాధించాను. కానీ ఎప్పటికైనా ఎస్ఐ కావాలన్నదే నా ఆశయం.

**–బద్దిరెడ్డి కృష్ణబాబు, కొత్తగూడెం బెటాలియన్**

## తల్లిదండ్రుల కష్టంతోనే కొలువు



పేదరికంలో ఉన్న తల్లిదండ్రులు, సోదరుడు నా చిన్నతనం నుంచే చదువు కోసం ఎంతో సహకరించారు. విద్యాభ్యాసానికి సంబంధించి ఎప్పుడు ఏది కావాలన్నా అడిగిందే తడువుగా ఆర్థిక పరిస్థితులు సహకరించకపోయినా తెచ్చి ఇచ్చేవారు. ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని వెన్నుతట్టి ప్రోత్సహించారు. బీటెక్ పూర్తయిన వెంటనే తెలంగాణ ప్రభుత్వం పోలీస్ కానిస్టేబుళ్ల ఉద్యోగాలకు నోటిఫికేషన్ వేసింది. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి చదువులో పోటీపడి అనుకున్న లక్ష్యం వైపు ముందుకు సాగా. చివరకు సీఎం కేసీఆర్ ప్రభుత్వంలో వచ్చిన నోటిఫికేషన్ ఆధారంగా తొలి ప్రయత్నంలోనే ప్రభుత్వ కొలువు సాధించా. ఎలాంటి పైరవీలు లేకుండా సొంత ప్రతిభతోనే ఉద్యోగం సాధించా. సొంతంగా కష్టపడి చదివి ఎక్సైజ్ కానిస్టేబుల్ కొలువుకు ఎంపికయ్యా.

**– మెంది శ్వేత, పోలవరం, బూర్గంపహాడ్ మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా**

## సీఎం కేసీఆర్ వచ్చాకే నా కొడుక్కు ఎక్సైజ్ ఎస్సై కొలువొచ్చింది



తెలంగాణలో కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాకనే 2020 సంవత్సరంలో నా కొడుకు సాయిబాబాకు ఎక్సైజ్ ఎస్సైగా ఉద్యోగం వచ్చింది. మా ఊళ్లో భార్యాభర్తలం పాలు అమ్ముకొని జీవిస్తున్నాం. మా కష్టానికి తోడు.. కొడుకు కష్టం తోడయ్యింది. రాత్రిపగలూ తేడా లేకుండా కష్టపడి చదివి ఉద్యోగం సాధించాడు. కొడుకు ఉద్యోగం కోసం ఎవరికి పైసా లంచం ఇవ్వలేదు. తెలంగాణ వచ్చినంకనే చదువుకున్న పిల్లలకు ప్రభుత్వం ఉద్యోగాలు వస్తున్నయి. నా కొడుక్కి ఉద్యోగం రావడంతో అందరం ఆనందంగా జీవిస్తున్నాం.

**– కాలసాని అచ్చమ్మ, చండ్రుగొండ**

# ప్రజా ఆశీర్వాద సభలకు పకడ్బందీ ఏర్పాట్లు

- సభలకు ప్రజలు లక్షలాదిగా తరలిరావాలి
- ఉమ్మడి జిల్లాలో పదికి పది సీట్లను కైవసం చేసుకుంటాం..
- రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్
- ఖమ్మం నగరంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, తదితరులు

ఖమ్మం, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఖమ్మం నగరంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల మైదానంతోపాటు కొత్తగూడెంలో ఈనెల 5న జరుగనున్న సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. ప్రజలు త్వరగా సభా ప్రాంగణాలకు చేరుకోవాలన్నారు. ఖమ్మం నగరంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మం జిల్లా పరిధిలోని పాలేరులో సీఎం కేసీఆర్ నిర్వహించిన మొదటి సభ, ఆ తర్వాత జరిగిన సత్తుపల్లి, భద్రాద్రి జిల్లాలోని ఇల్లెందులో జరిగిన సభలు గ్రాండ్ సక్సెస్ అయ్యాయన్నారు. సభా ప్రాంగణాల్లో ఎంతమంది జనం ఉన్నారో, అంతకంటే ఎక్కువ మంది స్థలం లేక బయటే ఉండిపోయారన్నారు. సభలకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారన్నారు. సీఎం కేసీఆర్ సభా ప్రాంగణం నుంచి అడిగిన ప్రతి ప్రశ్నకూ ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ధరణి పోర్టల్‌తోపాటు రైతుబంధును తీసివేస్తుందని సీఎం కేసీఆర్ సభాముఖంగా ప్రజలకు వివరించినప్పుడు ప్రజలు కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారన్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని పదికి పది సీట్లు దక్కించుకునే విధంగా తమ పార్టీ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. 75 సంవత్సరాల చరిత్రలో ఖమ్మం నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఖమ్మానికి మెడికల్ కాలేజీ తీసుకురావాలని గతంలో ఏ ప్రభుత్వమూ భావించలేదన్నారు. మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నాడు మంత్రిగా కొనసాగినప్పుడు ఖమ్మం నగరంలో నీటి ఎద్దడి ఉండేదన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాతే తాగునీటి సమస్యలకు పరిష్కారం చూపానన్నారు. తన నియోజకవర్గ పరిధిలోని ఒక్క రఘునాథపాలెం మండలంలోనే రూ.253 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. సమావేశంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు, డీసీసీబీ చైర్మన్ కురాకుల నాగభూషణం, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, నాయకులు ఆర్జేసీ కృష్ణ, జహీర్‌అలీ, బీరెడ్డి నాగచంద్రారెడ్డి, పగడాల నాగరాజు, చింతనిప్పు కృష్ణ చైతన్య, పులిపాటి ప్రసాద్, తాజుద్దీన్, డోకుపర్తి సుబ్బారావు, వెంకరమణ, వెంకన్న పాల్గొన్నారు.

### ఉత్తేజం నింపిన కేసీఆర్‌కు కృతజ్ఞతలు

- సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లి ప్రజాఆశీర్వాద సభకు విచ్చేసి నూతనోత్తేజాన్ని నింపిన సీఎం కేసీఆర్‌కు ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కృతజ్ఞతలు తెలిపారు. సభను విజయవంతం చేసిన ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. ఖమ్మం నగరం హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి సాధించిందన్నారు. మంత్రి పువ్వాడ అజయ్ కృషితోనే అభివృద్ధి సాధ్యమైందన్నారు. గత ఎన్నికల్లో కేవలం ఒక్క సీటు గెలిచినా, సీఎం కేసీఆర్ ఉమ్మడి జిల్లాను ఎప్పుడూ చిన్నచూపు చూడలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో పదికి పదికి స్థానాలనూ కైవసం చేసుకుంటామన్నారు. సీఎం కేసీఆర్ చొరవతోనే సత్తుపల్లిలో 100 పడకల ఆసుపత్రి అందుబాటులోకి వస్తున్నదన్నారు.

### ఖమ్మం, కొత్తగూడెం సభలను విజయవంతం చేయాలి

- ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు

5న ఖమ్మం, కొత్తగూడెంలో జరుగనున్న సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాలో నిర్వహించిన మూడు సభలూ విజయవంతం అయ్యాయన్నారు. మంత్రి అజయ్ రూ.వేల కోట్ల నిధులతో ఖమ్మం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారన్నారు. అభివృద్ధికి కృతజ్ఞతగా ప్రజలు వేలాదిగా సభకు తరలిరావాలన్నారు.

### లక్షలాది మంది కదిలిరావాలి..

- రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మంలో 5న జరుగనున్న సీఎం కేసీఆర్ సభకు లక్షలాది మంది ప్రజలు కదిలిరావాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పిలుపునిచ్చారు. పాలేరు, సత్తుపల్లి, ఇల్లెందు సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలను విజయవంతం చేసిన ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ప్రజలు 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి ఖమ్మం ఎమ్మెల్యే అభ్యర్థి పువ్వాడ అజయ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు.